సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 9 । జనవరి । 2024



భగవద్గీత ప్రవచనాలు

సిరిసిల్లటౌన్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లో సోమవారం భగవద్గీత ప్రవచనాలను స్వామి యజ్ఞానంద బోధించారు.



'బండి'కి అభినందనలు

ముస్తాబాద్: కిసాన్‌మోర్చా జాతీయ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన ఎంపీ బండి సంజయ్‌ను స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ అన్నమనేని శ్రీనివాస్‌రావు కలిసి, అభినందించారు.

గరిష్టం/కనిష్టం
30.0/19.0

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

సత్వర న్యాయానికి గ్రీవెన్స్ డే



తన కార్యాలయంలో బాధితుల గోడు వింటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతీ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 12 ఫిర్యాదులు స్వీకరించిన ఆయన సంబంధిత స్టేషన్ అధికారులకు ఆదేశాలిస్తూ, త్వరగా చర్యలు చేపట్టాలన్నారు. భూ, ఆస్తి తగాదాల విషయంలో చట్టప్రకారం నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజన్న కోడెల వ్యవహారంపై ఆరా

సాక్షి ఎఫెక్ట్

వేములవాడఅర్బన్: రాజన్న కోడెల తరలింపులో అక్రమాలు జరిగాయని వరుసగా రెండు రోజులు 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. ఇంటలిజెన్స్ పోలీసు అధికారులు సోమవారం రాజన్న గుడి కట్టకింద గోశాలకు వచ్చి తనిఖీలు చేసినట్లు తెలిసింది. రాజన్న ఆలయం కార్యాలయానికి వెళ్లి ఆరా తీసినట్లు సమాచారం. రాజన్న ఆలయానికి వస్తున్న కోడెలు, వాటిని గోశాలలకు పంపించే తీరును, రికార్డుల నమోదు, నిర్వహణపై ఆరా తీసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పోలీసు అధికారులు ఆరా తీయడంతో ఆలయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

నిహాల్ వైద్యానికి దాతల సహకారం

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన ఉలిసె నిహాల్ వైద్యం కోసం దాతలు ముందుకొచ్చారు. 'మా కొడుకును కాపాడండి' శీర్షికతో 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. పోకల అశోక్, నామాల శ్రీనివాస్, చిన్ను(ఎస్సై నిజామాబాద్ జిల్లా), బింగి మహేశ్, భరత్‌కుమార్ రూ.5వేల చొప్పున, వెంకట్రావుపేటకు చెందిన పల్లం పవన్, స్నేహితులు కలిపి రూ.20 వేలు, శివకుమార్ రూ.2వేలు, చంద్రమోహన్ రూ.2వేలు, వెంకటరావు రూ.2వేలు, కోటేశ్వర్‌రావు(రాజమండ్రి) రూ.వెయ్యి, శ్యామ్ రూ.వెయ్యి చొప్పున పంపించినట్లు తెలిపారు. చిన్నారి కాలేయ మార్పిడికి రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని, దాతలు స్పందించి ఆదుకోవాలని ఆ నిరుపేద తల్లిదండ్రులు ఉలిసె చందు-పల్లవి కోరుతున్నారు.

'డబుల్' అక్రమాలపై విచారణ చేపట్టాలి



గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో అక్రమాలపై విచారణ చేటప్టి అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ పలువురు సోమవారం స్థానిక తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా చేపట్టారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కొందరు అనధికారికంగా ప్రవేశించారని, బయట ఉన్న తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ భూపతి తెలిపారు. ఈ ధర్నాలో ముద్రకోల ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలి

- చేనేత, జౌళిశాఖ ఆఫీస్ ఎదుట నిరసన



సిరిసిల్లటౌన్: ఏటా ఇచ్చినట్లుగానే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం వస్త్రోత్పత్తి ఆర్డర్లను ఇవ్వాలని ఆసాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం సిరిసిల్లలోని చేనేత, జౌళిశాఖ ఆఫీసు ఎదుట నిరసన తెలిపి, మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ చీరలు పూర్తికాగానే కేసీఆర్ కిట్లు, క్రిస్మస్ ఆర్డర్లు వస్తుండేవని, ఇప్పుడు నాలుగు నెలలుగా ఎలాంటి ఆర్డర్లు రాలేదన్నారు. తమకు రావాల్సిన ఆర్డర్లలో సగానికి పైగా టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించారని పేర్కొన్నారు. దీంతో ఆసాములు, మ్యాక్స్ సంఘాల సభ్యులు ఉపాధి కోల్పోతున్నట్లు తెలిపారు. ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, చీరాల అశోక్, మండల రాజు, సాగర్, నరేశ్ పాల్గొన్నారు.

ఊరికో గోదాం

- గిరిజన గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు
- మహిళా మత్స్యకార్మిక సంఘాల ఏర్పాటు
- మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లో కుటీర పరిశ్రమలు
- బీడు భూములకు సాగునీరు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- జిల్లా అధికారులతో సుదీర్ఘ సమీక్ష



జిల్లా అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

సిరిసిల్ల: పంటలు నిల్వ చేసేందుకు ఊరికో గోదాం ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, రైతుల వడ్లను సకాలంలో కొనేలా ముందస్తు ప్రణాళికలు ఉండాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఎన్.ఖీమ్యానాయక్‌లతో కలిసి జిల్లా అభివృద్ధిపై సమీక్షించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మధ్యమానేరు ముంపు గ్రామాల ప్రజల జీవనోపాధికి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస ప్యాకేజీ, పరిహారం రాని వారిని గుర్తించి ప్రభుత్వ సాయం అందేలా చూడాలన్నారు. కొత్త సంవత్సరం కొత్త ఆలోచనలతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమల్లోకి తెచ్చామన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణ వార్డుల్లో, పల్లెల్లో ప్రజాపాలనకు శ్రీకారం చుట్టామన్నారు. యాసంగి వడ్ల కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలన్నారు. గన్నీసంచులు, ఇతర పరికాల కొరత లేకుండా చూడాలన్నారు. రైస్‌మిల్లర్లపై ఆధారపడకుండా ప్రతీ ఊరిలో ఓ గోదాం ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

మిషన్ భగీరథ నీటిపై అపోహలు తొలగించాలి

ఎంతో ఖర్చుతో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నీటిపై అపోహలు తొలగించి, ఆ నీరు తాగేలా చూడాలన్నారు. గ్రామాల్లో కళాజాతాలు, వీడియో డాక్యుమెంటరీల సహాయంతో ప్రచారం చేయాలన్నారు. మత్స్య మహిళా సహకార సొసైటీలు తక్కువ ఉండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు మహిళలు పొందలేకపోతున్నారని తెలిపారు. సంక్రాంతి పండుగ నుంచి ఓ యజ్ఞంలా జిల్లాలో ముదిరాజులు, గంగపుత్రులలోని మహిళలను భాగస్వామ్యం చేస్తూ మత్స్య సహకార మహిళా సొసైటీలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలోని రుద్రంగి, వీర్నపల్లి, బండలింగంపల్లిల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాలకు స్థలాలు గుర్తించాలన్నారు. శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉన్న కోనోకార్పస్ మొక్కలను పెంచొద్దని, ఇప్పటికే ఉన్న వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మొక్కలు నాటాలని కోరారు. వీర్నపల్లి మండలంలో పోడుభూములకు పట్టాలు ఇచ్చినా బోర్లు వేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని దానిపైన సంబంధిత అధికారులు దృష్టి సారించాలని సూచించారు.

బీడు భూములకు సాగునీరు

జిల్లాలో ప్యాకేజీ-9లో పెండింగ్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి బీడు భూములకు సాగునీరు అందించాలన్నారు. మల్కపేట రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల పురోగతిపై ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డితో సమీక్షించారు. సనుగుల ఎర్రచెరువు, పటేల్ చెరువు, లచ్చపేట చెరువు, రుద్రంగి సూరమ్మ చెరువులకు గోదావరి నీరు చేరాలని సూచించారు. మోత్కురావుపేట-చందుర్తి, మానాల-మరిమడ్ల రోడ్లకు అటవీశాఖ అనుమతులు వచ్చేలా చూసి, పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. లచ్చపేట చెరువు బ్యాక్‌వాటర్‌లో సనుగుల రోడ్డు మునుగుతుందని, రెండు చోట్ల వంతెనలు నిర్మించాలని పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్ సూచించారు. మూలవాగుపై నిర్మిస్తున్న వేములవాడ-తిప్పాపూర్ వంతెనను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

వేములవాడలో బాలికల జూనియర్ కళాశాల

వేములవాడలో బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని ఆది శ్రీనివాస్ కలెక్టర్‌ను కోరారు. వేములవాడలోని మూలవాగు, గుడిచెరువులోకి మురికినీరు చేరకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. వర్షాకాలంలో వేములవాడలోని బేడ బుడగ జంగాలకాలనీకి వరద నీరు రాకుండా అడ్డుకునే చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, ప్రత్యేక ఉపకలెక్టర్ బి.గంగయ్య, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీఏవో భాస్కర్, ఉద్యానవన అధికారి జ్యోతి, డీటీవో వై.కొండల్‌రావు, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, సీపీవో శ్రీనివాసచార్యులు, డీసీవో బుద్ధనాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా'వాణి' వినండి సారూ..

- సమస్యలపై విన్నవించేందుకు బారులు
- సమయానికి రాని అధికారులు
- సగం శాఖల సిబ్బంది గైర్హాజరు
- దరఖాస్తులు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్లు గౌతమి, ఖీమ్యానాయక్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

సిరిసిల్లటౌన్: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోక పలువురు బాధితులు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వస్తున్నారు. జిల్లా అధికారులకు తమ సమస్యలను విన్నవించుకుంటే త్వరగా పరిష్కారం అవుతాయనే ఆశతో పల్లెల నుంచి ఉదయమే కలెక్టరేట్ బాట పడుతున్నారు. అయితే కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు సైతం ఆలస్యంగా వచ్చారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణి 10.50 గంటలకు జిల్లా ఉన్నతాధికారులు వచ్చి ప్రారంభించారు. జిల్లాలోని సుమారు 54 ప్రభుత్వ శాఖలు ఉండగా.. కేవలం 30 శాఖలకు సంబంధించిన అధికారులు కూడా హాజరుకాలేదు. గతంలో వందల సంఖ్యలో వచ్చిన ఆర్జీలు తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడం గమనార్హం.

వివిధ సమస్యలపై 12 దరఖాస్తులు

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్లు పి. గౌతమి, ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చే ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అర్జీలను శాఖల వారీగా అధికారులకు సూచిస్తూ సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం కాకుంటే ఎందుకు కాలేదో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా అందివ్వాలని సూచించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ పి.గౌతమికి మరో అడిషనల్ కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. వివిధ సమస్యలపై 12 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ 4, డీపీవో 2, సర్వే 1, డీఆర్‌డీవో 1, ఉపాధి కల్పన శాఖ 1, వైద్యారోగ్య శాఖ 1, డీపీవో 1, వ్యవసాయ శాఖ 1 దరఖాస్తు వచ్చాయి. స్పెషల్ సబ్‌కలెక్టర్ బి.గంగయ్య, డీఆర్‌డీవోలు ఆనందకుమార్, మధుసూదన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వాలి



డబుల్‌బెడ్‌రూమ్ అర్హుల జాబితాలో నా పేరు ఉంది. అయినా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. మా ఊరికి చెందిన ముఖ్య నాయకుడు డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానన్నడు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారిందని తప్పించుకున్నడు. మాకు ఎవ్వరు లేరు. 30 ఏళ్ల సంది కిరాయి ఇంట్లో ఉంటున్నం.

– దోలి ఎల్లవ్వ- లింగం, గంభీరావుపేట

మా భూమి మాకు చేయాలి



మా ఊర్లో మామయ్య లోకుర్తి బొందయ్య పేరున సర్వే నంబర్ 351/బి/బి, 351/డి/సి, 352/ఏ/సిలలో మొత్తంగా 35 గుంటల భూమి ఉంది. ఇప్పుడు ఇతరుల పేరున అక్రమంగా మారింది. ఎట్ల మారిందో తెల్వదు. వారసత్వంగా సంక్రమించిన భూమికి మాపేరున పట్టాను ఇప్పించాలి.

– లోకుర్తి రాజేశ్వరి, మామిడిపల్లి

పర్యాటక రంగంపై యువతకు శిక్షణ

- గగన్ విహారి సంస్థ అధినేత అన్నల్‌దాస్ అజయ్‌కుమార్



శిక్షణ పొందిన యువతులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అన్నల్‌దాస్ అజయ్‌కుమార్

సిరిసిల్ల: పర్యాటకరంగంపై యువతీ, యువకులకు శిక్షణతో ఉపాధికి బాటలు వేస్తున్నామని గగన్ విహారి సంస్థ అధినేత అన్నల్‌దాస్ అజయ్‌కుమార్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన పలువురు యువతీయువకులకు సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సిరిసిల్లకు చెందిన అజయ్‌కుమార్ హైదరాబాద్‌లో గగన్ విహారి టూర్స్, ట్రావెల్స్ సంస్థను స్థాపించారు. ఆయన మాట్లాడుతూ విదేశాల నుంచి ఇండియాకు.. ఇండియా నుంచి విదేశాలకు వెళ్లే వారికి ఆయా ప్రాంతాల్లోని స్థానిక అంశాలపై అవగాహన కల్పించడం, పర్యాటక విషయాలు వివరించే లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. టూరిజం, ట్రావెలింగ్ అంశాల్లో స్కాలర్‌షిప్‌తో ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన యువతకు 45 రోజులపాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు ఇప్పటికే శిక్షణ పొందిన 40 మందికి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రజుమంలో సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, కీర్తన, హమీదా, హెన్రీ పిళ్లై, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి



ఎస్పీని కలిసిన ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి

సిరిసిల్లక్రైం: వృత్తిరీత్యా శిక్షణ తీసుకునేందుకు ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి సోమవారం జిల్లాకు వచ్చారు. పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిశారు. ఆరు నెలలపాటు శిక్షణకు జిల్లాకు వచ్చారు. 2022 బ్యాచ్‌కు చెందిన రాహుల్ రెడ్డి బీటెక్ పూర్తి చేసి సివిల్ సర్వీసెస్ ద్వారా తెలంగాణ క్యాడర్‌కు ఎంపికయ్యారు.

సీసీ కెమెరాలతో అదుపులోకి నేరాలు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- కేసీఆర్ నగర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్ (డబుల్ బెడ్ రూమ్) సముదాయంలో సోమవారం సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాలతో నేరాలను అదుపుచేయవచ్చన్నారు. యువత అసాంఘిక కార్యక్రమాలను దూరంగా ఉండాలని సూచించారు. కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించండి

- టీఎస్‌పీటీఏ సంఘం ప్రతినిధులు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: ప్రాథమిక పాఠశాలల్లో ఆంగ్ల మీడియం ప్రవేశపెట్టినందున ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాలని టీఎస్‌పీటీఏ సంఘం ప్రతినిధులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో విప్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలని, స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. అర్ధంతరంగా నిలిచిన ఎస్జీటీల పదోన్నతులు, బదిలీలను టెట్‌తో సంబంధం లేకుండా కొనసాగించాలని కోరారు. దీనిపై ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. ప్రతీ వ్యక్తికి తొలి గురువు ఎస్జీటీలు అని, వారి సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం టీఎస్‌పీటీఏ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉత్తమ్ విజయ్‌కుమార్, బత్తుల రవీందర్, పాముల రాజు, మిట్టపల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.

అందుబాటులోకి ఆధునిక సింగిల్‌విండో భవనాలు

- టెస్కాబ్ ఛైర్మన్ రవీందర్‌రావు



నూతన భవనాన్ని పరిశీలిస్తున్న రవీందర్‌రావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సింగిల్‌విండోలకు అధునాతన భవనాలను అందుబాటులోకి తెస్తున్నట్లు టెస్కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో నూతనంగా నిర్మించిన భవనాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడారు. రైతులు, ఖాతాదారుల కోసం అన్ని ఏర్పాట్లతో ఆధునిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. బంగలింగంపల్లిలో క్లస్టర్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ రైతులు సింగిల్‌విండో ఛైర్మన్ గుండారపు కృష్ణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, కృష్ణహరి, మల్లేశం, బండారి బాల్‌రెడ్డి, ఎద్ల సాగర్, పిల్లి కిషన్, బాలకిషన్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపైనే విశ్వాసం

- సర్కారు ఆస్పత్రులపై పెరిగిన నమ్మకం
- 2023లో 3,128 డెలివరీలు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో 1,309 ప్రసవాలు
- ప్రజలకు అందిని ప్రసూతి సేవల ఖరీదు రూ.10.94 కోట్లు
- సిరిసిల్ల, వేములవాడ ఆస్పత్రిల్లో 13 మంది పీఆర్‌వోలు

> నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానాకు.. అనే కాలం నుంచి ప్రభుత్వ వైద్యమే నయం.. అనే పరిస్థితులు వచ్చాయి. ప్రైవేట్‌లో వైద్య సేవల ఖరీదు పెరగడం.. అక్కడ లభిస్తున్న వైద్యసేవలు అన్ని సర్కారీ దవాఖానాల్లో అందుబాటులో ఉండడంతో జిల్లా ప్రజలకు ప్రభుత్వ వైద్యసేవలపై నమ్మకం పెరిగింది.



జిల్లా ఆస్పత్రి ప్రసూతి వార్డులో వైద్యసేవలు పొందుతున్న బాలింతలు

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో 2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు 4437 ప్రసవాలు జరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 3,128 డెలివరీలు కాగా.. ప్రైవేటు ఆస్పత్రుల్లో 1,309 ప్రసవాలు జరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 70.50 శాతం ప్రసూతి సేవలు అందిస్తే, 29.50 శాతం ప్రైవేటు ఆస్పత్రుల్లో డెలివరీలు అయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రిలో ఒక్కో డెలివరీకి కనీసం రూ.35వేలు వసూలు చేస్తున్నారు. అంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేసిన కాన్పుల ఖరీదు రూ.10.94 కోట్లు. ఈమేరకు పేదలకు ఒక్క 2023 సంవత్సరంలోనే ప్రసూతి ఖర్చులు ఆదా అయ్యాయి. ప్రైవేటు వైద్యశాలలకు దీటుగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రసూతి సేవలు మెరుగ్గా అందుతున్నాయి. ఫలితంగా అందరూ సర్కారు ఆస్పత్రుల వైపు అడుగులు వేస్తున్నారు.

ఆత్మీయ 'మాతృసేవా'

జిల్లాలో 'మాతృసేవా' పేరుతో రాష్ట్రంలోనే తొలిసారి పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గర్భిణులకు సహాయకారిగా ఉండేందుకు సిరిసిల్లలో 8 మంది, వేములవాడలో ఐదుగురు మొత్తంగా 13 మంది పీఆర్‌వోలను నియమించారు. వీరు మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు ఆస్పత్రిలో అందుబాటులో ఉంటూ.. గర్భిణులు ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు వెంట ఉండి అందిస్తారు. పీఆర్‌వో సేవలతో ప్రభుత్వ ఆస్పత్రిపై నమ్మకం పెరగడంతోపాటు ఆ సేవలు విస్తృతం చేసి మరింత మందిని సర్కారు ఆస్పత్రికి రప్పించగలిగారు. ఫలితంగా డిసెంబర్‌లో అత్యధికంగా 339 డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రిలో అయ్యాయి. జిల్లాలో జరిగిన మొత్తం ప్రసవాల్లో 80 శాతం డెలివరీలు సర్కారు ఆస్పత్రుల్లో కావడం విశేషం.

సేవలు భేష్

సిరిసిల్ల జిల్లా ఆస్పత్రి, వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది, పీఆర్‌వోల సేవలు భేషుగ్గా ఉండడంతో ఒకరిని చూసి మరొకరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి సేవలు పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆస్పత్రిలో పీఆర్‌వోలను సులభంగా గుర్తించేందుకు వీలుగా ప్రత్యేక డ్రెస్‌కోడ్ ఏర్పాటు చేశారు. ఈ హెల్త్ సూపర్‌వైజర్ల(పీఆర్‌వో)కు సహాయకులుగా నర్సింగ్ కాలేజీ విద్యార్థులు కూడా ఉన్నారు. గర్భిణులు ఎవరు ఆస్పత్రికొచ్చిన నవ్వుతూ.. ఆత్మీయంగా మాట్లాడుతూ.. ప్రేమపూర్వకంగా అన్ని రకాల వైద్య సేవలు అందించారు. ఫలితంగా సర్కారు ఆస్పత్రుల్లో శభాష్ అనిపించే ప్రసూతి సేవలు అందాయి.



వేములవాడలో గర్భిణీకి పరీక్షలు

జిల్లాలో 2023లో ప్రసవాల వివరాలు ఇలా..

నెల	ప్రసవాలు	ప్రభుత్వ ఆస్పత్రులు	ప్రైవేటు ఆస్పత్రులు
ఏప్రిల్	512	286	226
మే	552	336	216
జూన్	497	314	183
జూలై	496	342	154
ఆగస్టు	512	389	123
సెప్టెంబరు	484	385	99
అక్టోబరు	482	370	112
నవంబరు	489	377	112
డిసెంబరు	423	339	84
మొత్తం	4,437	3,128	1,309

80 శాతం లక్ష్యం సాధించాం



జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 80 శాతం మేరకు డెలివరీలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వైద్యులు, సిబ్బంది కృషితో జిల్లాలో డిసెంబరులో 80 శాతం డెలివరీలు చేశాం. పది నెలల కిందట 62 శాతం ఉండేది. ఇప్పుడు 80 శాతానికి తెచ్చాం. 'మాతృసేవా' కార్యక్రమంతో ఇది సాధ్యమైంది. ఇదే ఒరవడిని కొనసాగిస్తాం. పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తాం. లక్ష్య సాధనకు శ్రమించి వైద్యులకు, సిబ్బందికి అభినందనలు.

– అనురాగ్ జయంతి, కలెక్టర్

ఉచిత సేవలు ఉత్తవేనా?

- నిగ్గదీయి లేదా ఫిర్యాదు చేయి
- పెట్రోల్ బంకుల్లో ఈ సేవలుండాల్సిందే
- జిల్లాలోని చాలా చోట్ల కనిపించని సౌకర్యాలు
- పట్టించుకోని అధికారులు

"కరీంనగర్‌కు చెందిన శ్రీధర్ కమాన్‌కు సమీపంలోని ఓ పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకునేందుకు వెళ్లాడు. పెట్రోల్ పోసుకుని, బైక్ టైర్‌లో గాలి నింపాలని అక్కడి సిబ్బందిని కోరగా.. ఇక్కడ అలాంటివేమీ ఉండవని, గాలి పంపు పనిచేయడం లేదని సమాధానం ఇచ్చారు. చాలాబంకుల్లో గాలి నింపేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు నగరంలో ఉన్నాయి. గాలే కాదు.. చాలా బంకుల్లో మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలు కానరావడం లేదు."

కరీంనగర్ అర్బన్: పెట్రోల్ బంకుల్లో ఉచిత సేవలకు అనుచితంగా వ్యవహరిస్తున్నారా అయితే ఇది మీ కోసమే. బంకుల్లో టైర్లలో గాలి, తాగునీరు, మూత్రశాలలు, ఫోన్ సౌకర్యం తదితర సేవలు ఉచితం. వీటిపై అవగాహన లేకపోవడంతో డబ్బులు వసూలు చేస్తున్నారు. అసలే పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే అదనపు వ్యయం భారంగా మారుతోంది. చిల్లరే కదా అనుకుంటే నెలకు రూ.కోట్లలోనే సామాన్యుల జేబుకు చిల్లు పడుతోంది.



నగరంలోని ఓ పెట్రోల్ బంకు

మనం చెల్లించే డబ్బులే..

- డీజిల్ అయినా పెట్రోలైనా లీటరుపై మనం పెట్రోలు బంక్‌కు 4 నుంచి 6 పైసలు కేవలం మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ కోసం చెల్లిస్తున్నాం. ప్రతీ బంకులో టాయిలెట్, మంచినీరు, ఎయిర్ ఫ్రీగా అందించాలి. ఇలా అందిస్తేనే పెట్రోల్ బంకు నిర్వహణకు అనుమతి దొరుకుతుంది.
- చాలామంది ప్రయాణంలో ఉన్న వారు టాయిలెట్ అర్జంట్ అయినప్పుడు పబ్లిక్ టాయిలెట్స్ కోసమో.. నిర్మానుష్య ప్రదేశాల కోసమో వెతుకుతారు. కానీ పెట్రోల్ బంకుకు వెళ్లరు. ఇక మీద ఎమర్జెన్సీ టైంలో దర్జాగా బంక్‌లకు వెళ్లండి.

అది మన హక్కు

- సగటున ఒక బంకులో రోజుకు 10 వేల లీటర్ల చమురు అమ్మితే.. టాయిలెట్ మెయింటనెన్స్ కాస్ట్ కింద ఆ బంకుకు వచ్చే ఆదాయం రోజుకు రూ.600 అంటే నెలకు రూ.18వేలు. జిల్లాలో ఉన్న అన్ని బంకుల్లో కలిపి వాహనదారులు రోజువారీగా చెల్లిస్తున్న మొత్తం రూ.14లక్షలకు పైనే. ఈ డబ్బుతో టాయిలెట్, మంచినీరు అందించాల్సిన బాధ్యత ఆయా బంక్‌లదే.
- పెట్రోల్ పంపుల వద్ద స్వచ్ఛమైన తాగునీటి వసతి ఉండాలి. ఇందుకోసం ఆర్వోయంత్రం, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాలి. ఏ బంకుల్లోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయొచ్చు. స్వచ్ఛభారత్‌లో భాగంగా అన్ని పెట్రోలు, డీజిల్ బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉంచాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.
- అత్యవసర పరిస్థితుల్లో చరవాణి వినియోగించుకునే సదుపాయం పంపుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యలో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోలు పంపును సందర్శించడం ద్వారా మీరు ఏ నంబర్‌కు అయినా కాల్స్ చేసుకోవచ్చు.
- వాహన టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఓ వ్యక్తిని అందుబాటులో ఉంచాలి. ఈ సౌకర్యం పూర్తిగా ఉచితంగా పొందొచ్చు. ఇటీవల గాలికి ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు.
- ప్రతి బంకులో ఫిర్యాదు పెట్టె లేదా రిజిష్టరు అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రథమ చికిత్స కిట్ సౌకర్యం ప్రతీ బంకు వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది.
- చమురు నాణ్యత, ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. పెట్రోలు, డీజిల్ నాణ్యత, పరిమాణాన్ని తెలుసుకునేందుకు ఫిల్టర్ పేపర్లు అందుబాటులో ఉంచాలి. వాటి ద్వారా నాణ్యతను పరీక్షించుకునే హక్కు మనకు ఉంటుంది
- పెట్రోలు బంకుల్లో సంస్థ పేరు, యజమాని పేరు, సంప్రదింపుల నంబర్లు కచ్చితంగా ఏర్పాటు చేయాలి. పంపు యజమాని వాటిని ప్రజలకు కనిపించే విధంగా బంకుల ఎదుట ఏర్పాటు చేయాలి. పెట్రోలు బంకుల్లో బంకులు తెరిచే, మూసివేసే వేళలు తప్పనిసరిగా రాసి ఉంచాలి. పెట్రోలు, డీజిల్ తీసుకున్న తరువాత వినియోగదారులు వాటికి సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా పొందాలి.

జిల్లాలో పెట్రోల్ బంకులు: 82	
రోజు పెట్రోల్ వినియోగం: 1.20లక్షల లీటర్లు	
నిత్యం డీజిల్ వాడకం	: 1.80లక్షల లీటర్లు
ద్విచక్ర వాహనాల సంఖ్య: 1.45లక్షలు	
మూడు, నాలుగు చక్రాల వాహనాలు: 88వేలు	

ఇలా ఫిర్యాదు చేయండి

పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు అందించాల్సిన సౌకర్యాలను నిర్వాహకులు విస్మరిస్తే సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్‌ను సంప్రదించడం ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. బంకులో కచ్చితంగా ఉండాల్సిన ఫిర్యాదు రిజిష్టరులో లిఖితపూర్వకంగా ఫిర్యాదు నమోదు చేయొచ్చు. లేదంటే సంబంధిత చమురు సంస్థ సేల్స్ మేనేజర్ పేరు, చరవాణి నంబర్లకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ఇవన్నీ అందుబాటులో లేనట్టైతే సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు.

క్లుప్తంగా

న్యాయవాదులకు చెస్ పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి ప్రతిమ

కరీంనగర్‌క్రైం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు న్యాయవాదులకు, న్యాయమూర్తులకు కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం న్యాయవాది రఘురామన్ పర్యవేక్షణలో చెస్ పోటీలు నిర్వహించగా జిల్లా జడ్జి బి.ప్రతిమ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం చెస్‌పోటీల్లో న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీవాణి నీరజ, లక్ష్మీ కుమారి, అరుణ, మెజిస్ట్రేట్లు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కరీంనగర్: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనకబడిన తరగతుల సంక్షేమ విద్యాశాఖల ఆధ్వర్యంలో ఇంగ్లిష్ మీడియంలో బోధనతో విజయవంతంగా నడుస్తున్న గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 5వతరగతిలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థినీవిద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి ఈనెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు.

రహదారి పూడ్చివేతపై ఆందోళన

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే రహదారి పూడ్చివేతపై సోమవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామ శివారులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 30 ఏళ్ల క్రితం హస్నాబాద్, చెర్లపల్లి, చల్‌గల్ గ్రామాల ప్రజలు భక్తులు రహదారిని నిర్మించారు. అయితే దారి పక్కనున్న భూయజమాని రెండురోజుల క్రితం పొక్లెయిన్లు పెట్టి తన వ్యవసాయ భూమితోపాటు రహదారిని కూడా తొలగించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రహదారి వద్దకు వెళ్లి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు అర్బన్ ఆర్‌ఐ రాజేందర్ సంఘటన స్థలానికి చేరుకుని పనులను నిలిపివేయించి విచారణ చేపట్టారు. ఆలయానికి వెళ్లే రహదారిని పునరుద్ధరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

వెంకట్రావుపల్లిలో వాటర్‌ట్యాంకర్ బోల్తా

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో మండలంలోని వెంకట్రావుపల్లి పరిసరాల్లో రోడ్డుపై నీళ్ల పడుతున్న వాటర్ ట్యాంకర్ సోమవారం బోల్తా పడింది. వెంకట్రావుపల్లి పరిసరాల్లో ఫోర్‌లేన్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డుపై పోసిన కంకర్రపై నీళ్లు చల్లడానికి ట్రాక్టర్ టేలర్‌పై వాటర్‌ట్యాంకర్ అమర్చారు. రోడ్డు చివరిలో కంకర వద్ద ట్రాక్టర్ అదుపు తప్పడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

నిందితులను త్వరలో పట్టుకుంటాం

- కరీనంగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు
- ఎస్సారెస్పీ కార్యాలయం సందర్శన
- ఆఫీస్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

తిమ్మాపూర్: మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ నీటి పారుదలశాఖ డివిజన్ 5 కార్యాలయాన్ని కరీనంగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు సోమవారం సందర్శించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని అన్నారు. కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన చోరీపై సీఐ స్వామి, ఎస్సై చేరాలుతో కలిసి విచారణ చేశారు. నాలుగు సీపీయూలు, ఐదు మానిటర్లు, రెండు ప్రింటర్లు ఎత్తుకెళ్లినట్లు వాచ్‌మెన్ కనకయ్య ఎల్‌ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు కార్యాలయానికి చేరుకున్న ఎస్సై చేరాలు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. సోమవారం క్లూస్‌టీం పిలిపించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. కార్యాలయం ఆవరణలో రెండు సీసీ కెమెరాలు ఉన్నా చాలాకాలంగా పనిచేయడం లేదని చోరీపై ఎస్ఈఈ శివకుమార్‌తో మాట్లాడామని తెలిపారు. కంప్యూటర్లలో విలువైన డేటా ఉందని దానికి సంబంధించిన హార్డ్ కాపీలు తమ వద్ద ఉన్నాయని, పెద్దగా నష్టం లేదని చెప్పారని, అయినా ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని వివరించారు. క్లూస్ టీం ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు. కంప్యూటర్లు చోరీ చేసినా డేటా పోలేదని ఈఈ నాగభూషణం తెలిపారు. కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆయన వివరణ ఇచ్చారు.



ఎస్ఈఈ శివకుమార్‌తో మాట్లాడుతున్న ఏసీపీ

అల్ఫోర్స్‌లో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబురాల్లో విద్యార్థులు, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

జగిత్యాల: ప్రేమ ఆప్యాయత పంచే పండగ సంక్రాంతి అని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కృష్ణానగర్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ ద్వారా సంప్రదాయాల పరిరక్షణ, సందేశాలు అందించవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మల్యాలలో

మల్యాల: మల్యాల మండలంలోని అల్ఫోర్స్ టెక్నో స్కూల్‌లో సంక్రాంతి వేడుకలను సంస్థ అధినేత నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. గంగిరెద్దుల ఆటలు, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హకీ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి: జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఖ్యాతి లభిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో నాలుగో తరగతి చదివే కతిక్ పటేల్ జాయతీస్థాయి హాకీ పోటీలకు ఎంపిక కాగా.. సోమవారం విద్యార్థిని అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి రాజస్థాన్‌లో జరిగే జాతీయపోటీలకు ఎంపిక అయినట్లు వివరించారు. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

యూరియా పంపిణీలో చేతివాటం

- బస్తాకు రూ.9 అదనంగా వసూలు
- ఆందోళనకు దిగిన రైతులు
- వెంటనే రూ.6 తగ్గించి విక్రయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు యూరియాను విక్రయించడంలో సంఘం ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించారు. బస్తాకు రూ.9 పెంచి విక్రయించడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో అప్పటికప్పుడే రూ.6 తగ్గించి అమ్మకాలు సాగించారు. ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో ఆధ్వర్యంలో బండలింగంపల్లిలో సోమవారం ఒక లారీలో 450 యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేయడానికి తీసుకెళ్లారు. సమీప ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో ఒక బస్తాకు రూ.267 విక్రయిస్తుంటే.. బండలింగంపల్లిలో రూ.276 వసూలు చేయడంపై రైతులు ఆందోళనకు దిగారు. దీంతో వెంటనే రూ.270 విక్రయించారు. ఈ విషయంపై సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి వివరణ కోరగా.. నిరాధారమైన ఆరోపణ మాత్రమేనన్నారు. బండలింగంపల్లికి క్లస్టర్ పాయింట్ లేకపోవడంతో లారీలకు అదనపు రవాణా చార్జీల కోసం బస్తాకు రూ.3 చొప్పున మాత్రమే తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతకంటే ఎక్కువగా రైతుల నుంచి వసూలు చేస్తే సదరు ఉద్యోగిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



యూరియా లారీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కుమ్మరిగుట్ట తవ్వకాలపై పరిశీలన

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి శివారులోని కుమ్మరిగుట్ట అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారి సుదర్శన్ సోమవారం పరిశీలించారు. సోమన్‌పల్లి శివారులోని కుమ్మరిగుట్టను కొంతమంది జేసీబీ యజమానులు కొద్దికాలంగా అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో గ్రామస్తులు మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. మైనింగ్ అధికారి సుదర్శన్ అక్కడకు చేరుకునేసరికి జేసీబీతోపాటు, ట్రాక్టర్లతో పరారీ అయ్యారు. అక్కడ జరిగిన తవ్వకాలను మైనింగ్ అధికారులు పూర్తిగా పరిశీలించి వచ్చారు.



కుమ్మరిగుట్ట తవ్విన ప్రాంతం

గల్ఫ్‌లో గుండెపోటుతో చందుర్తి వాసి మృతి

చందుర్తి(వేములవాడ): జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మరణించిన సంఘటన చందుర్తి మండల కేంద్రంలో సోమవారం విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన కొత్తపల్లి నాగయ్య ఉరఫ్ కైరా నాగయ్య(56) జీవనోపాధి కోసం సౌదీ అరేబియాకు గత 20 ఏళ్లుగా వెళ్లి వస్తున్నారు. రెండేళ్ల క్రితమే స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. సౌదీలోనే 15 రోజుల క్రితం పనిచేసే చోటే చాతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుని భార్య 15 ఏళ్ల క్రితమే మృతిచెందగా, ముగ్గురు కుమారులు ఉన్నారు.



నాగయ్య(ఫైల్)

గోదావరి నదిలో మృతదేహం

రామగుండం: అంతర్గాం మండలం గోలివాడ శివారులోని గోదావరినదిలో సోమవారం పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సంతోష్‌కుమార్ సోమవారం తెలిపారు. మృతుడి వయసు సుమారు 40–45 మధ్య ఉంటుందని, నీలిరంగు టీషర్ట్, నలుపు రంగు ఫ్యాంట్ ధరించాడని, మెడలో నల్లటి తాయత్తు ఉందన్నారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. సంబంధీకులు ఎస్సై సెల్ నంబరు 87126 56527, సీఐ సెల్‌నంబరు 87126 56524లో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ మైనింగ్ సర్దార్ మృతి

గోదావరిఖని: సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా కాజీపేట–2 గనిలో పనిచేస్తున్న మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ (37) గోదావరిఖని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. డిసెంబర్ 22న కాజీపేట–2గనిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన రమేశ్‌ను చికిత్స నిమిత్తం గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే, కాలి విరిగినట్లు గుర్తించిన వైద్యులు.. ఎక్సరే తీస్తుండగా రమేశ్ అకస్మాత్తుగా మృతి చెందారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే మైనింగ్ సర్దార్ రమేశ్ మృతి చెందాడని సీఐటీయూ నాయకుడు మెండే శ్రీనివాస్ ఆరోపించారు. ఈ ఘటనపై ఏసీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా లంగ్స్‌లో బ్లడ్‌క్లాట్ కావడంతో అకస్మాత్తుగా మృతి చెందారన్నారు. పోస్ట్ కోవిడ్‌తో ఈ సంఘటన జరిగి ఉండవచ్చునని వివరించారు.



మచ్చ రమేశ్ (ఫైల్)

గాయపడిన యువకుడి మృతి

పెద్దపల్లిరూరల్: అప్పన్నపేట వద్ద ఈనెల 6న జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డ కనుకుంట్ల రాజేశ్(18) చికిత్స పొందుతూ సోమవారం మరణించాడని బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు. పెద్దపల్లి మండలం దేవునిపల్లికి చెందిన రాజేశ్.. తన సోదరి హారికను అప్పన్నపేటలో దింపేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 8 తులాల వెండి చోరీ

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన గంజి నర్మద ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామానికి చెందిన నర్మద హనుమాన్‌వాడలో అద్దెకుంటోంది. ఈనెల 6న ఇంటికి తాళం వేసి గోపులాపూర్ గ్రామానికి వెళ్లింది. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 8 తులాల వెండిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహమాన్ తెలిపారు.

లింక్ క్లిక్ చేయగానే డబ్బులు విత్‌డ్రా

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎలుపుల బాపు సైబర్ వలలో చిక్కుకొని డబ్బులు పోగొట్టుకున్నాడు. 9440051827 నంబర్ నుంచి వచ్చిన లింక్‌ను బాపు ఓపెన్ చేయగానే వెంటనే రూ. 18 వేలు డ్రా అయినట్లు ఎస్ఎంఎస్ వచ్చింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌కు కేసు బదిలీ చేశామని పోలీసులు తెలిపారు.

సత్తక్కపల్లి శివారులో చిరుత..?

- పాదముద్రలు గుర్తించిన రైతులు
- అటవీశాఖకు సమాచారమిచ్చిన అన్నదాతలు
- హైనా పాదముద్రలని అనుమానిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారు ఉసికె గుట్ట అటవీ ప్రాంతం సమీపంలో చిరుతపులి పాదముద్రలను రైతులు గుర్తించారు. సోమవారం గ్రామానికి చెందిన ఓ రైతు మొక్కజొన్న చేనులోకి వెళ్లగా.. అక్కడ చిరుతపులి పాదముద్రలు కనిపించాయని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆ ప్రాంతానికి చేరుకున్న అధికారులు పాదముద్రలను పరిశీలించారు. అవి చిరుతపులి పాదాలు కావని, హైనా(తోడెలు) పాదముద్రలు అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ ప్రాంతం వైపు హైనా లేకపోవడం, కొంత చిరుతపులి సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్న అధికారులు.. మరుసటిరోజు మరోమారు పాదముద్రలను పరిశీలిస్తామని అధికారులు రైతులకు చెప్పారు. అటవీ పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా పెడుతామని ప్రజలు భయాందోళనకు గురికావొద్దని సూచించారు. ఇక్కడ ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హఫీజొద్దిన్, బీట్ ఆఫీసర్ శివరాజ్, సిబ్బంది గణేశ్ ఉన్నారు.



శివారు పంటపొలాల్లో పాదముద్రలు

పొలంలో కరెంట్ తీగలు అమర్చిన వ్యక్తి అరెస్ట్

- చందుర్తి సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి(వేములవాడ): పంటక్షేత్రంలో అక్రమంగా విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి ఒకరికి గాయాలు కావడానికి కారణమైన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని రామన్నపేటకు చెందిన రైతు తిప్పని రాజయ్య పొలం వద్ద వన్యప్రాణులతో పంటపొలం దెబ్బతింటుందని విద్యుత్ తీగలతో కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన బెంద్రం నరసింహారెడ్డి ఉరఫ్ నవీన్‌రెడ్డితోపాటు ఆయన భార్య వర్షిణిలు డిసెంబర్ 25న వరినారు కోసం రాజయ్య పొలం వద్దకు వెళ్తుండగా విద్యుత్ తీగలు తగిలి నరసింహారెడ్డి అక్కడే పడిపోయాడు. అప్రమత్తమైన ఆయన భార్య వర్షిణి అక్కడే ఉన్న మరో రైతు చింతల దేవయ్యతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపి వేయించింది. అప్పటికే విద్యుత్‌షాక్‌తో కాళ్లకు తీవ్ర గాయాలై కిందపడి పోయిన నరసింహారెడ్డి స్థానికుల సహాయంతో గ్రామానికి తీసుకొచ్చి, 108 అంబులెన్స్‌లో వేములవాడకు తరలించారు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి.. బాధ్యుడైన తిప్పని రాజయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చినట్లు తెలిస్తే వారిపై పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. చందుర్తి ఇన్‌చార్జి ఎస్సై రాజేశ్, సిబ్బంది ఉన్నారు.

కన్నబిడ్డను చూడకుండానే..

- కన్నుమూసిన మాతృమూర్తి
- మాతృత్వాన్ని ఆస్వాదించకుండానే మృతిచెందిన బాలింత
- కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు



పద్మ(ఫైల్)

వేములవాడఅర్బన్: మాతృత్వం కోసం ఆ తల్లి కోటి కలలు కన్నది. దాదాపు 18 ఏళ్ల నిరీక్షణ అనంతరం గర్భవతి కావడంతో మురిసిపోయింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన ఆ మాతృమూర్తి కన్నబిడ్డను చూడకుండానే కన్నుమూసింది. ఈ సంఘటన వేములవాడలోని నాంపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన చేకూట తిరుపతికి బావుసాయిపేటకు చెందిన పద్మ(35)కు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. చాలా ఏళ్ల తర్వాత గర్భం దాల్చడంతో వేములవాడ మున్సిపల్ పరిధి గల నాంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రతీ నెల వైద్యసేవలు పొందింది. ఇందులో భాగంగానే ప్రసూతి కోసం ఆదివారం ఆస్పత్రికి చేరుకుంది. సోమవారం ఉదయం ఆపరేషన్ చేయడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కొంత సమయానికి ఆమె పరిస్థితి విషమిస్తుందని వైద్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్ తీసుకెళ్లగా.. అక్కడికి చేరుకో గానే ఆమె మృతిచెందింది. దీంతో ఆమె బంధువులు నాంపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ ఘటనపై వేములవాడ పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.



వేములవాడ పరిధిలోని నాంపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతురాలు బంధువులు

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

కొండగట్టు(చొప్పదండి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రాలేదని కార్యకర్తలు అధైర్యపడొద్దని, పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎంపీపీ మేనేని స్వర్ణలత, నాయకులు మేనేని రాజనర్సింగరావు, శ్రీనివాస్, సింగిరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాజన్నను ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ పి.గౌతమి దర్శించుకున్నారు. స్వామివారికి కోడెమొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు.



రాజన్న ప్రసాదం అందిస్తున్న ఆలయ అధికారులు